క్లుప్తంగా

దర్గాల అభివృద్ధికి కృషి



ఫిరంగిపురం: దర్గాలు, మసీదుల అభివృద్ధికి వక్ఫ్ బోర్డు కృషి చేస్తుందని రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈఓ షేక్ మహమ్మద్ అలీ అన్నారు. మండలంలోని వేములూరిపాడు గ్రామంలోని ఆయన స్వగృహానికి వచ్చిన వక్ఫ్‌బోర్డు సీఈఓ మహమ్మద్ అలీని పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం కొండవీడు గ్రామంలోని హజరత్ సయ్యద్ హుదాదే ఫకీర్‌షా చౌదరీ దర్గా మరియు మసీదు కమిటీ సభ్యులు శనివారం కలిశారు. నూతనంగా సీఈఓగా నియమితులైనందుకు అభినందనలు తెలిపారు. దర్గా ప్రెసిడెంట్ సయ్యద్ నవషాద్, సెక్రటరీ సయ్యద్ షహెన్‌షా, కమిటీ సభ్యులు సయ్యద్ అబ్దుల్ వహీద్, సయ్యద్ సనావుల్లా, సయ్యద్ జమాల్, సయ్యద్ జహంగీరు ఉన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రికి సామగ్రి వితరణ

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం ప్రభుత్వ ఆసుపత్రికి పల్లెటూరు చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు శనివారం ఆసుపత్రికి అవసరమైన సామగ్రిని అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ జొన్న రాజేష్ మాట్లాడుతూ తాడేపల్లి ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్‌కు బీపీ మిషన్లు, వేయింగ్ మిషన్లు, బ్యాటరీలు, హైట్ మెజరింగ్ టేపులు, ఎల్ఈడీ టార్చి లైట్లు అవసరమని తెలియజేశారని, మణికంఠ అనే యువకుడు ముందుకు వచ్చి ట్రస్ట్ తరపున ఆర్థికసాయం అందజేశారన్నారు. వైద్యులు శాంతి, అనూష, సీహెచ్ఓ గురుకుమార్, యూడీసీ హరి, ఆయుర్వేదిక్ డాక్టర్ శ్రీధర్, హెల్త్ సూపర్‌వైజర్ రమాదేవి, స్టాఫ్ నర్స్ ఉమాదేవి, హాస్పిటల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఏసీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిరూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం ముందుకురావాలని సీఐటీయూ నాయకుడు వేముల దుర్గారావు అన్నారు. శనివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానంద పురంలో సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ప్రారంభించి, మాట్లాడారు. కూరపాటి స్టీవెన్, కె.ఆదినారాయణ, ఎం.ఆశీర్వాదం, ఎం.గురవయ్య, ఆరిఫ్, ఇమాంబి పాల్గొన్నారు.

మున్సిపాలిటీ వాహనంలో స్పేర్ పార్ట్స్ చోరీ

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ దగ్గర పార్కింగ్ చేసిన కార్పొరేషన్ చెత్త వాహనంలో స్పేర్ పార్ట్స్ చోరీకి గురైన సంఘటన ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం తాడేపల్లి పట్టణ, రూరల్‌పరిధిలో చెత్త సేకరించే వాహనాలను ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ వద్ద పార్కింగ్ చేస్తున్నారు. అక్కడ పార్కింగ్ చేసిన వాహనాల్లో తరచు స్పేర్ పార్ట్స్ చోరీకి గురవుతున్నాయి. వాహన డ్రైవర్లు, సిబ్బంది బైపాస్‌రోడ్‌లోని పాత సామాన్లు కొనే పలు దుకాణాలకు సమాచారం ఇచ్చారు. స్పేర్ పార్ట్స్ దొంగిలించిన వ్యక్తి ఆ పార్ట్స్‌ను అమ్మడానికి రాగా షాపు యజమానితో బేరం ఆడుతూ దొంగిలించిన వ్యక్తి ఫొటోను, ఆ వ్యక్తి వచ్చిన ఆటో నెంబరుతో సహా వీడియో తీస్తుండగా దొంగిలించిన వ్యక్తి అక్కడి నుంచి పరారయ్యాడు. కార్పొరేషన్ అధికారుల సూచనల మేరకు తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో శానిటేషన్ సిబ్బంది ఫిర్యాదు చేశారు.

మహనీయుడు అబుల్ కలాం ఆజాద్

దుగ్గిరాల: స్వాతంత్య్ర సమరయోధుడు, దేశ తొలి విద్యాశాఖ మంత్రి అబుల్ కలాం ఆజాద్ వర్ధంతిని గ్రామంలోని ముర్తుజానగర్ జెండా చెట్టు దగ్గర శనివారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి సుభానీ ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టిన విద్య విప్లవాన్ని తీసుకువచ్చారని, ఆజాద్ 10 సంవత్సరాలు జైలు జీవితం గడిపి స్వాతంత్ర్యోద్యమంలో కీలకపాత్ర పోషించారన్నారు. తొలి విద్యాశాఖ మంత్రిగా పనిచేసి అనేక సంస్కరణలను అమలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్‌కె.రషీద్, ఎస్‌కె కుద్దూస్, ఎస్‌కె.జిలానీ, టి.యోహన్, టి.రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రేరణ తరగతులు



మేడికొండూరు: మండలంలోని పేరేచర్ల ఆపిల్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో శనివారం పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇంగ్లీష్ ఫర్ యూ ఇన్‌స్టిట్యూషన్స్ అకడమిక్ డైరెక్టర్ వి.వి.ఈశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం 2023–24 పదో తరగతిలో మండల స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థి వై. సాయి వెంకటేష్‌కు రూ. 25 వేలు, రెండవ ర్యాంకు సాధించిన విద్యార్థిని కె. పూజశ్రీకి రూ.10 వేలు విద్యాసంస్థల తరపున నగదు ప్రోత్సాహకాలు అందజేశారు.

శ్రమైక జీవన సౌందర్యం



ఆటోలు, ట్రాక్టర్లలో పనులకు వెళ్లేందుకు సిద్ధమైన వలస కూలీలు



పని పూర్తిచేసుకొని మిర్చి టిక్కీలతో బయలుదేరి..

మండలంలోని రావెల, మందపాడు గ్రామాలు వలస కూలీలతో సందడిగా మారాయి. మిర్చి పనులు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో కర్నూలు ప్రాంతం నుంచి వచ్చిన వలస కూలీలు పంట పొలాల్లో తాత్కాలిక నివాసాలను ఏర్పాటు చేసుకొని పనులకు వెళుతున్నారు. పంట పొలాల్లో మిర్చి కోతలు, కల్లాల్లో మిర్చి ఆరబెట్టడం, తాలు కాయలు ఏరడంతో పాటు రాత్రిళ్ల కల్లాల్లో కాపలా కాసే పనులు చేస్తూ స్థానికంగా ఉపాధి పొందుతున్నారు. పక్క గ్రామాల నుంచి సైతం రైతులు వచ్చి తమ పనులకు ట్రాక్టర్లు, ఆటోలు పెట్టి కూలీలను తీసుకెళ్లేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. దీంతో ఆయా గ్రామాలు శ్రమైక జీవన సౌందర్యానికి ప్రతిబింబాలుగా మారాయి.

– తాడికొండ



కోసిన మిర్చిని కల్లాల్లోకి తరలిస్తూ..



కల్లాల్లో మిర్చిని ఆరబెడుతూ..

చేతి వృత్తిదారులకు నిధులు కేటాయించాలి

మంగళగిరి టౌన్: చేతి వృత్తుల పరిరక్షణకు, వృత్తిదారుల సంక్షేమానికి కార్పొరేషన్లకు నిధులు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొట్టిముక్కల బాలాజీ డిమాండ్ చేశారు. మంగళగిరి పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బాలాజీ మాట్లాడుతూ దేశంలోను, రాష్ట్రంలోను చేతి వృత్తులను ప్రోత్సహించడంలో పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు. ఆయా వృత్తుల్లో ఆధునిక యంత్రాలు రావడం, కార్పొరేట్ సంస్థలకు పాలక ప్రభుత్వాలు లక్షలాది రూపాయలు రాయితీల రూపంలో అందిస్తుంటే వృత్తిదారులు కార్పొరేట్లతో పోటీ పడలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 24న మంగళగిరిలోని వేములపల్లి శ్రీకృష్ణ భవన్‌లో జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సదస్సులో చేతివృత్తిదారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగాంజనేయులు, గీత పనివార్ల సంఘం నాయకుడు కంచర్ల కాశయ్య, మంగళగిరి నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

హామీలు అటకెక్కించిన కూటమి ప్రభుత్వం

- వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు
- బేతపూడిలో నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు

ఫిరంగిపురం: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు కూటమి ప్రభుత్వం ఇంతవరకు అమలు చేయలేదని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు అన్నారు. మండలంలోని బేతపూడి గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులుతో ఆత్మీయ సమ్మేళనం శనివారం రాత్రి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మఒడి, రైతు భరోసా, ఫీజు రీయింబర్స్‌మెంటు, నూతన పింఛన్లు వంటి పలు పథకాలను ప్రభుత్వం అటకెక్కించారని చెప్పారు. రాష్ట్రంలో పేద, సామాన్య కుటుంబాలకు చెందిన వారు పథకాలు అందక పలు కష్టాలు పడుతున్నారన్నారు. పేదల కష్టాలకు ఫలితం దక్కాలంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. ప్రతి చోట పార్టీకి ప్రజాదరణ పెరుగుతుందని తెలిపారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికీ మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. గ్రామంలోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరి కష్టసుఖాల్లో తాను తోడుగా ఉంటానని నాయకులు, కార్యకర్తలకు హామీ ఇచ్చారు. పార్టీకోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఆకాంక్షించారు. పార్టీని గ్రామంలో మరింతగా పటిష్టం చేయాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, సర్పంచి గంథూళి ఆదంబీ, గంథూళి మస్తాన్‌వలి, ఎంపీటీసీ సభ్యుడు ఖాసిం సాహెబ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఖాజావలి, షేక్.షరీఫ్, షేక్.మహబూబ్ సుబాని, పెరికల చిన్నా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మణిపాల్ హాస్పిటల్‌లో క్యాథ్‌ల్యాబ్ ప్రారంభం



క్యాథ్‌ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ బి.సోమరాజు, మణిపాల్ వైద్యులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడులోని మణిపాల్ హాస్పిటల్ కార్డియాలజీ సేవలను అందించేందుకు సియమెన్స్ ఆర్టిస్‌జీ సాంకేతికతతో నిర్మించిన అత్యాధునిక క్యాథ్ ల్యాబ్‌ను శనివారం ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ బి.సోమరాజు విచ్చేసి ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ బి.సోమరాజు మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతికత, పెరిగిన సామర్థ్యంతో మణిపాల్ హాస్పిటల్ విభిన్న రోగుల అవసరాలను తీర్చగల అత్యుత్తమ వైద్యసేవలను అందించేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. మణిపాల్ హాస్పిటల్ క్లస్టర్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి మాట్లాడుతూ ఈ అత్యాధునిక క్యాథ్‌ల్యాబ్ ప్రాంతీయ ఆరోగ్య సంరక్షణ సేవల పురోగతిలో కీలకమైలు రాయి అని తెలిపారు. సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎస్.మురళీకృష్ణ మాట్లాడుతూ రోగులకు అత్యుత్తమ గుండె సంరక్షణను అందించేందుకు ఈ అత్యాధునిక సాంకేతికత కల్గిన క్యాథ్‌ల్యాబ్ అందిస్తుందని పేర్కొన్నారు.

మోసపూరితంగా స్థలం విక్రయించిన వారిపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): లేని భూమిని ఉన్నట్లుగా చూపి మోసపూరితంగా విక్రయించడమే కాకుండా.. కొనుగోలు చేసిన వారిని బెదిరించిన వ్యక్తులపై భవానీపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. భవానీపురం స్వాతి సెంటర్‌కు చెందిన ఆకుల వెంకట కిరణ్ గొల్లపూడి గ్రామ సర్వే నెంబర్ 472/2 నందు ప్లాట్– 8లో 300 గజాల స్థలాన్ని గుంటూరు జిల్లా తాడేపల్లి లెనిన్‌నగర్‌కు చెందిన షేక్ రష్మీజా సుల్తానాకు విక్రయించారు. 2020లో గాంధీనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేశారు. ఇందుకు గాను రూ.36 లక్షలు చెల్లించారు. రిజిస్ట్రేషన్ తర్వాత స్థలం కొనుగోలు చేసిన సుల్తానాకు ఒరిజినల్ పేపర్స్ ఇవ్వడం లేదు. రిజిస్ట్రేషన్ చేసిన ప్లాట్‌ను చూపించడం లేదు. నేవీలో పని చేస్తున్న సుల్తానా భర్త ఇమ్రాన్ హుస్సేన్ ఆర్నెళ్ల తర్వాత వచ్చి భూమి చూపించమని ఆకుల వెంకటకిరణ్‌ను అడిగారు. అడిగిన ప్రతిసారి కాలం వెళ్లదీస్తూ వచ్చాడు. తర్వాత భార్యభర్తలు ఇద్దరూ స్థానికంగా విచారించగా స్థలం విక్రయించిన వ్యక్తి తమను మోసగించాడని తెలిసింది. స్థలం చూపాలని లేదా తాము ఇచ్చిన సొమ్ము వడ్డీతో సహా చెల్లించాలని కోరారు. దీంతో అతను దంపతులను బెదిరించాడు. రూ.36 లక్షలు తాను ఒక్కడినే తీసుకోలేదని ఈపూరి జేమ్స్, రాజేంద్ర కలిసి పంచుకున్నట్లు తెలిపాడు. రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈసీ పరిశీలించగా సదరు స్థలాన్ని ఈపూరి జేమ్స్ అప్పటికే వేరే వ్యక్తులకు జీపీఏ చేశారని, వారు ఇతరులు విక్రయించినట్లు బయటపడింది. దీనిపై బాధితులు భవానీపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

డొంక రోడ్డులో యువకులు హల్‌చల్



యువకులు వదిలేసిన ద్విచక్ర వాహనాలు



గాయపడిన రైతు వేణుగోపాల రెడ్డి

ప్రశ్నించిన రైతులపై రాళ్లతో దాడి

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని అమరావతి రోడ్డులో దేవుడి మాన్యం సమీపంలో పంట పొలాల్లో ఉన్న డొంక రోడ్డులో అతివేగంగా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న యువకులను శనివారం రైతులు అడ్డుకున్నారు. ఇద్దరు యువకుల్లో ఒకడు విచక్షణారహితంగా రైతులపై దాడి చేశాడు. వేణుగోపాల రెడ్డి అనే రైతుకు నుదిటిపై గాయమైంది. చుట్టుపక్కల రైతులు పరిగెత్తుకు రావడంతో డొంక రోడ్డులో వెళ్లే మార్గం లేక రెండు ద్విచక్ర వాహనాలను, ఒక సెల్ ఫోన్‌ను వదిలేసి యువకులు పరారయ్యారు. దీనిపై ఆ ప్రాంత రైతులు తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డొంక రోడ్డులో నిత్యం మద్యం, గంజాయి తాగిన ఆకతాయిలు సీసాలు పగలకొట్టి పొలాల్లో విసిరి వేస్తున్నారని, దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. తాము వెంట పడడంతో రాళ్లు విసిరారని తెలిపారు. ఆ యువకులపై కేసు నమోదు చేస్తున్నట్లు సీఐ కళ్యాణ్ రాజు తెలిపారు.

'ప్రియదర్శిని'లో శిక్షణ తరగతులు



దుగ్గిరాల: చింతలపూడిలో ప్రియదర్శిని ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్ ఫర్ వుమెన్‌లో శనివారం సీఎస్‌సీ విభాగం, గగన్ యాప్స్ శిక్షణ తరగతులు నిర్వహించారు. విద్యార్థులకు వెబ్ సైట్ డిజైన్, డెవలప్‌మెంట్‌పై శిక్షణ అందించారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. చైర్మన్ చందు రామారావు, ప్రిన్సిపాల్ టి.రాఘవేంద్ర విష్ణు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.సుజాత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పటిష్టతకు కృషి చేయాలి




తాడేపల్లిరూరల్: తమకు అప్పగించిన పదవులను నమ్మకంగా, బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని నాయకులు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడిగా ఎంపికైన సయ్యద్ గౌస్ మొహిద్దీన్ శనివారం పలువురు పార్టీ నేతలను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్‌రాజు, తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డిలను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలోని ఇతర నాయకులు, కార్యకర్తలను కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. వైఎస్సార్ సీపీ మంగళగిరి పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, రూరల్ అధ్యక్షుడు నాలి వెంకట కృష్ణ, నాయకులు మేకా వెంకట రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో మట్టి లారీలు, ట్రాక్టర్ల హల్‌చల్



మంగళగిరి: గత కొద్ది రోజులుగా నగరంలో మట్టి టిప్పర్లు, లారీలు, ట్రాక్టర్లు స్వైరవిహారం చేస్తున్నారు. పగలు రాత్రీ తేడా లేకుండా 24 గంటలు మట్టి టిప్పర్లు అతివేగంగా, భయంకరంగా హారన్‌ల శబ్దాలతో అతి వేగంగా తిరుగుతుండడం స్థానికులను ఆందోళన కలిగిస్తుంది. ఇప్పటికే టిప్పర్ల అతి వేగంతో నిడమర్రు రోడ్డుతో పాటు గౌతమబుద్ధా రోడ్డులో ప్రమాదాలు చోటు చేసుకోగా వాహనదారులు స్వల్పగాయాలతో బయటపడిన ఘటనలున్నాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి టిప్పర్లు, లారీలు, ట్రాక్టర్‌లను వేగంగా వెళ్లకుండా అదుపు చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి క్రీడల్లో చలపతి ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ



మోతడక(తాడికొండ): రాష్ట్రస్థాయి క్రీడా ఉత్సవాల్లో తమ కళాశాల విద్యార్థులు క్యారమ్స్‌లో మొదటి బహుమతి సాధించారని మోతడక చలపతి కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.వెంకట రామారావు తెలిపారు. మిలనోత్సవ్ 4.0 రాష్ట్రస్థాయి క్రీడా ఉత్సవాలలో పాల్గొన్న తమ కళాశాల బీ ఫార్మసీ ఫస్టియర్ విద్యార్థులు ఎస్.దివ్యశ్రీ, టి.కోమలి ప్రథమ బహుమతి సాధించగా వై.అఖిల్, షేక్ జబీబ్ ద్వితీయ బహుమతి సాధించినట్లు తెలిపారు. విజేతలను చలపతి విద్యా సంస్థల అధినేత వైవీ ఆంజనేయులు అభినందించారు.

'టైలర్స్‌డే' విజయవంతం చేయండి



ఎస్ఐ రవీంద్రనాయక్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

మంగళగిరి టౌన్: ఈనెల 28వ తేదీన నిర్వహించనున్న టైలర్స్‌డే వేడుకలను విజయవంతం చేయాలని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పిలుపునిచ్చారు. టైలర్స్‌డే వేడుకల సందర్భంగా మంగళగిరి నగర పరిధిలోని వివిధ శాఖల అధికారులకు శనివారం వారు ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళగిరి ఈద్గా షాదీ మహల్‌లో ఈనెల 28వ తేదీన అమరావతి టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా, మంగళగిరి పట్టణ ఎస్ఐ రవీంద్రనాయక్, మంగళగిరి అసిస్టెంట్ ఆఫీసర్ మూర్తిలకు వేడుకల ఆహ్వాన పత్రికలను అందజేశారు.అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగుల్ మీరా, జంజనం వెంకట సాంబశివరావు, కోశాధికారి భాస్కర్ పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపదపై అవగాహన

ఫిరంగిపురం: చెత్త నుంచి సంపదను తయారు చేసుకోవచ్చని డీఎల్‌పీఓ (డివిజనల్ పంచాయతీ అధికారి) శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని సొలస బస్టాండు సెంటర్ వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడారు. ప్రజలకు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. తడిగాఉన్న పదార్థాలను నీలి రంగు డబ్బాలో, పొడిగాఉండే వస్తువులు, పదార్థాలు ఆకుపచ్చ రంగు డబ్బాలో వేసేలా చూడాలని చెప్పారు. దానిని సేకరించిన క్లాప్ మిత్రలు సంపద కేంద్రాల వద్దకు చేర్చుతారని, దానిని వేరుచేసి దాని నుంచి సేంద్రియ ఎరువులు తయారు చేస్తారని తెలిపారు. దీనిద్వారా రైతులకు ఎంతో లాభమన్నారు. సేంద్రీయ ఎరువుల వాడకంతో పంటల దిగుబడి పెరుగుతుందన్నారు. సేంద్రీయ ఎరువుల తయారీతో సంపద చేకూరుతుందని, అది పంచాయతీ అభివృద్ధికి దోహదం చేస్తుందని చెప్పారు. ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు, పంచాయతీ ఈఓ ఏకే బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

దుగ్గిరాలలో...

దుగ్గిరాల: దుగ్గిరాల గ్రామంలో శనివారం పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి ఎరువులుగా తయారు చేసి ప్రజలకు తక్కువ ధరకే అందించాలని, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ద్వారా అమ్మకాలు చేస్తారని పంచాయతీ ఈవో వివేకానంద్ తెలిపారు. ఈవోపీఆర్డీ కెజె నెహ్రూ, ఎంపీడీఓ ఎ.శ్రీనివాసరావు, పాల్గొన్నారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శులు, వారి క్లాప్ మిత్రలతో ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించి తడి చెత్త, పొడి చెత్తలను వేరు చేసి సేకరించారు.

నాజర్ జీవితం కళాకారులకు ఆదర్శం

పొన్నెకల్లులో బుర్రకథ పితామహుడు నాజర్ 28వ వర్ధంతి కార్యక్రమం



నాజర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పొన్నెకల్లు(తాడికొండ): తన ప్రదర్శనల ద్వారా ప్రజలను చైతన్యం చేసిన నాజర్ మరణించినా ప్రజల గుండెల్లో అమరుడిగా నిలిచిపోయారని దూదేకుల సంఘం నాయకులు డి.నాగూర్ వలి, ఎస్.రాజ్‌కుమార్ అన్నారు. పొన్నెకల్లులో జన్మించి బుర్రకథ పితామహుడిగా ఎదిగి పద్మశ్రీ అవార్డు పొందిన నాజర్ జీవితం కళాకారులకు, సామాన్యులకు ఆదర్శమన్నారు. ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి చైతన్యవంతులను చేయాల్సిన బాధ్యత నేటితరంపై ఉందన్నారు. దూదేకుల సంఘం నాయకులు షేక్ సర్దార్, షేక్ షరీఫ్, రేపూడి శ్రీనివాసరావు, షేక్ ఆదాం సాహెబ్, శాఖమూరి సాంబశివరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేఎస్ లక్ష్మణరావుకు మద్దతుగా ప్రచారం

తాడేపల్లిరూరల్: కృష్ణా–గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ తాడేపల్లి పట్టణ, రూరల్ ప్రాంతాల్లోని ఎర్రగడ్డ, బొగ్గిళ్లు, ఎంహెచ్‌బీ కాలనీ, పాకిస్తాన్ ఏరియా తాడేపల్లి బైపాస్ రోడ్‌లోని అపార్ట్‌మెంట్లు, ఉండవల్లిలలో ప్రజా సంఘాల నాయకులు కరపత్రాలు పంపిణీ చేస్తూ శనివారం విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్లు, కౌలు రైతు, రైతుల సమస్యలపై శాసనమండలిలో ప్రశ్నించగల సత్తా వున్న కేఎస్ లక్ష్మణరావును గెలిపించుకోవాలని పట్టభద్ర ఓటర్లను కోరామని తెలిపారు. ప్రజా సంఘాల నాయకులు వేముల దుర్గారావు, సిమెంట్ ఫ్యాక్టరీ యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, ఏషియా, అనిల్, ఎస్.దుర్గారావు, నరసింహారావు, ఎస్.ఇమ్మానియేల్ రాజు, సైకం వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి టౌన్: కృష్ణా–గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుండి పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేఎస్ లక్ష్మణరావును పట్టభద్రులు ఓట్లు వేసి గెలిపించుకోవాలని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. మంగళగిరి ప్రజా సంఘాల కార్యాలయంలో శనివారం విస్తృత సమావేశం నిర్వహించారు. సీఐటీయూ నాయకులు ఎస్.చంగయ్య, గుంటూరు జిల్లా కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు రామారావు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో...

దుగ్గిరాల: మండలంలోని ఈమని గ్రామంలో బీసీ, ఎస్సీ కాలనీలలో ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు తరపున శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఓటు కలిగిన పట్టభద్రుల ఓటర్లను కలిసి తమ అమూల్యమైన ఓటు పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు వేసి ఆయనను అఖండ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో కార్మిక నాయకుడు జెట్టి బాలరాజు, గిరీష్, సురేష్, వై.బాబురావు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

బాడన్ పావెల్ జయంతి వేడుకలు

దుగ్గిరాల: స్కౌట్స్ వ్యవస్థాపకులు రాబర్ట్ బాడన్ పావెల్ జయంతి వేడుకలు శనివారం స్థానిక దుగ్గిరాల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం ఎస్.శోభాదేవి అధ్యక్షతన జరిగాయి. పావెల్ చిత్రపటానికి పూలమాలలు వేసి విద్యార్థులు గౌరవ వందనం చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణా తరగతులు

దుగ్గిరాల: దుగ్గిరాల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ టీచర్లకు శనివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవానీ, ఆర్‌పీ వున్నం ప్రసాద్‌లు పాల్గొన్నారు. కార్యక్రమంలో మూడునుంచి ఎనిమిది సంవత్సరాలు వయస్సు విద్యార్థులకు ప్రాథమిక బోధన ఎలా జరగాలి, పిల్లలు ఎలాంటి లక్షణాలు కలిగి ఉంటారు, వారికి ఎలాంటి బోధన అనే అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఎంఈఓ కాజా లక్ష్మీనారాయణ, వెన్యూ డైరెక్టర్ జి.బాలసుందరం, తదితరులు పాల్గొన్నారు.